క్లుప్తంగా

సిద్ధార్థ్ హాస్పిటల్ ప్రారంభం



నెల్లూరు(అర్బన్) : నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో సిద్ధార్థ్ ఎండోక్రైన్ అండ్ డెర్మటాలజీ హాస్పిటల్‌ను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరకే వైద్యం అందిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ నేతలు డాక్టర్ శివప్రసాద్, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, ఆస్పత్రి అధినేతలు డాక్టర్ సిద్దు నిఖిత్, డాక్టర్ ప్రీతిరెడ్డి పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యం.. ప్రజలకు కష్టం

- తొమ్మిది గంటల పాటు సరఫరా నిలిపివేత

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 54వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీలోని గృహ సముదాయంలో ఆదివారం ఏకంగా 9 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టిడ్కో గృహ సముదాయంలోని ఏ–91 అపార్టుమెంట్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. దీనిపై వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి ఫోన్ ద్వారా తెలియజేస్తే తమ పరిధిలో లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో చివరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు ఎట్టకేలకు సాయంత్రం 6.15 గంటలకు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలి



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నివాసాల మధ్య మద్యం దుకాణాలను తొలగించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని వాకర్స్‌రోడ్డులో మద్యం దుకాణాన్ని తొలగించాలని గత 34 రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న స్థానిక మహిళలకు మద్దతుగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర ఇన్‌చార్జి సంజయ్‌కుమార్, సుదీర్, జుబేర్, ప్రతాప్, సుధాకర్, దీపక్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా..



రామలింగాపురం అండర్‌బ్రిడ్జి వద్ద రోడ్డుపై పడిన చెట్టుకొమ్మలు

నెల్లూరు(బారకాసు) : నగరంలోని రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద చెట్టు కొమ్మలు విరిగి రహదారికి అడ్డంగా ఉన్నాయి. దీంతో రాకపోకలు కష్టతరంగా మారింది. ఇక్కడి ప్రాంతంలో నిత్యం వేల సంఖ్యలో వాహన రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో చెట్టుకొమ్మలు విరిగి దారికి అడ్డంగా పడి ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. వెంటనే కార్పొరేషన్ సిబ్బంది చెట్టు కొమ్మలను తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా అంబళ్ల పూజ

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరులో అయ్యప్పస్వామి అంబళ్లపూజ వేడుకగా ఆదివారం రాత్రి నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు స్వామివారి గీతాలను ఆలపించి భజనలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

గ్రామ దేవతలకు పూజలు

మనుబోలు: మనుబోలు గ్రామ దేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మకు ప్రత్యేక పూజలను గ్రామస్తులు ఆదివారం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను అర్చకుడు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో జరిపారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో గ్రామదేవతలను దర్శించుకొని సలిపిండి, పానకాలను నైవేద్యంగా సమర్పించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ముత్తుకూరు: మండలంలోని బ్రహ్మదేవి, ఈదులవారిపాళెం, కోమటిగుంట, గోవిందరెడ్డిపాళెం, పొట్టెంపాడు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి – ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు.

ప్లాస్టిక్ కవర్లపై నిషేధమేదీ?

- మార్కెట్‌లో విచ్చలవిడిగా వినియోగం
- నిబంధనలకు తూట్లు
- ఎక్కడ చూసినా 20 మైక్రాన్ల కవర్లే
- మున్సిపాలిటీ చెత్తలో సగం ప్లాస్టిక్ వ్యర్థాలే



డంపింగ్ యార్డులో చెత్తతో సమానంగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు



కూరగాయల మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్‌లో కూరగాయల విక్రయం

నెల్లూరు(బారకాసు) : ప్లాస్టిక్ కవర్ల వ్యర్థాలు నగరాన్ని పట్టి పీడిస్తున్నాయి. చెత్తకుప్పలు మొదలు డ్రైనేజీ కాలువల వరకూ ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. ప్లాస్టిక్ నిబంధనలకు పాతర వేయడంతో ప్రమాద తీవ్రత ఏటికేటికీ పెరుగుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం స్పందించడం లేదు. ఓ వైపు ప్లాస్టిక్ కవర్ల వినియోగం పెరుగుతుండడం, మరోవైపు వాటిని రీసైక్లింగ్ చేసే యూనిట్లు అతి తక్కువగా ఉండడం విస్మయానికి గురిచేస్తోంది.

నిబంధనలు ఇవీ..

సాధారణంగా 40 మైక్రాన్ల మందమున్న ప్లాస్టిక్ కవర్లను మాత్రమే వాడాలనే నిబంధన ఉండేది. అయితే కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 2016లో కొత్త నిబంధనలు విధించింది. 50 మైక్రాన్ కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్ల తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆస్పత్రుల్లో విడుదలవుతున్న బయో వ్యర్థాలపై కూడా ఆంక్షలు విధించింది. ఎక్కడైతే బయో వ్యర్థాలు విడుదలవుతున్నాయో వాటి నిర్వీర్యంలో కూడా ఆ సంస్థలే ప్రధానంగా బాధ్యత వహించాలని సూచించింది. కానీ ఈ నిబంధనలు జిల్లాలో అమలు కావడం లేదు.

చిన్న షాపుల నుంచి మాల్స్ వరకు..

ఇటీవలి కాలంలో 20 మైక్రాన్ల మందం మాత్రమే ఉన్న ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా అందుబాటులోకి వచ్చాయి. బడ్డీకొట్లు, చికెన్ షాపులు, టిఫిన్ అంగళ్లు, తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు విక్రయించేవారు, చేపల మార్కెట్లు తదితర చోట్ల 20 మైక్రాన్ల ప్లాస్టిక్ కవర్లనే వాడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లు ఉత్పత్తి చేసినా, వినియోగించినా రూ.25 వేల జరిమానా విధించాలని ఉన్నా పట్టించుకునే నాథుడే లేరు. అప్పుడప్పుడు నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై దాడులు నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకుని అపరాధ రుసుం విధించడం, తరువాత పట్టించుకోకపోవడంతో మార్కెట్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు యథావిధిగా జరగడం సర్వసాధారణమైపోయింది. సరైన చర్యలు లేకపోవడమే ఇందుకు కారణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

నియంత్రణ చర్యలు శూన్యం

నాసిరకం ప్లాస్టిక్ బ్యాగుల నియంత్రణ లీగల్ మెట్రాలజీ పరిధిలోకి వస్తుంది. కానీ వీటిని ఆశాఖ అధికారులు నియంత్రిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. పెద్ద పెద్ద మాల్స్‌లో కూడా 20 మైక్రాన్‌ల బ్యాగులు వాడుతున్నా పట్టించుకోవడం లేదు. కొన్ని టీ స్టాళ్లలో వేడి వేడి టీని కూడా ఇలాంటి కవర్లలోనే పార్శిల్ చేసి ఇస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం

నిషేధిత ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం. మనం తీసుకునే ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్లడం, అందులోని పదార్థాలను తీసుకోవడం వల్ల ప్రమాదకర కేన్సర్ బారిన పడుతాం. సాధ్యమైనంత వరకూ నిషేధిత ప్లాస్టిక్‌కు దూరంగా ఉండడం ఆరోగ్యకరం.
– డాక్టర్ జిజియాభాయి, అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆఫీసర్, నగరపాలక సంస్థ

చర్యలు తీసుకుంటున్నాం



ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. నిషేధిక ప్లాస్టిక్‌ను ఎవరూ వినియోగించరాదు. ప్లాస్టిక్ నియంత్రణకు తరచూ డ్రైవ్‌లు చేపడుతున్నాం. ప్రజలు సైతం నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించకూడదు. వీటి వల్ల పర్యావరణంతో పాటు మనుషులకు సమస్యగా మారుతుంది.
– డాక్టర్ చైతన్య, హెల్త్ ఆఫీసర్, నగరపాలక సంస్థ

మట్టి అక్రమ తరలింపును అడ్డుకోండి



నిరసన చేస్తున్న సీపీఐ, ఏఐవైఎఫ్ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపును అధికారులు అడ్డుకోవడం మానేసి ప్రోత్సహిస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్‌వాజ్‌లు ఆరోపించారు. ఈ మేరకు నగరంలోని నారాయణరెడ్డిపేటలో వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత నెల రోజులుగా మైపాడు గేటు నుంచి మైపాడు వరకు రోడ్డు విస్తరణ పనుల కాంట్రాక్టు తీసుకున్న తిరుపాల్‌రెడ్డి రోడ్డు విస్తరణ పేరుతో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగిస్తూ, రవాణా చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిరోజు 200 టిప్పర్లతో మట్టిని ప్రైవేటు లేఅవుట్లకు తరలిస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్, మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చర్యలు తీసుకోకుంటే కలెక్టరేట్ వద్ద నిరసన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, ముత్యాలు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

'అపోలో'లో షోల్డర్ మార్పిడి సర్జరీలు



మాట్లాడుతున్న డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్) : అపోలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో రోబోటిక్ విధానంలో వంద శాతం విజయవంతంగా షోల్డర్(భుజం) రిప్లేస్‌మెంట్ సర్జరీలు చేస్తున్నామని షోల్డర్ రోబోటిక్ సర్జన్ పమ్మి కార్తీక్‌రెడ్డి, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ మదన్ మోహన్‌రెడ్డి తెలిపారు. షోల్డర్ రిప్లేస్‌మెంట్ చేయించుకుని కోలుకున్న వారితో కలిసి హరనాథపురంలోని అపోలో ఆస్పత్రిలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. సాధారణంగా మోకాలి కీలు, తుంటి కీళ్ల మార్పిడి గురించి అందరికీ తెలుసని, అయితే షోల్డర్‌లో భరించరాని నొప్పి వచ్చి చొక్కా వేసుకోవాలన్నా, తల దువ్వుకోవాలన్నా వీలుకాని వారికి తొలిసారిగా అపోలో ఆస్పత్రిలో ఆధునిక పద్ధతుల ద్వారా రిప్లేస్ సర్జరీలు చేస్తున్నామన్నారు. సాధారణ శస్త్ర చికిత్స ద్వారా నయం చేయలేని ఎముక పగుళ్లు ఉన్నవారికి రోబోటిక్ సర్జరీలు నూరు శాతం ఉపయోగమన్నారు. ఈ సర్జరీ ద్వారా నొప్పి తక్కువగా ఉంటుందని, రోగి వేగంగా కోలుకుంటారన్నారు. ఆరు వారాల్లో రోగి తన పనులను యథావిధిగా చేసుకోవచ్చన్నారు. అలాగే నీ(మోకాలు కీలు)కి కూడా రోబోటిక్ సర్జరీలు ఎంతో ఉపయోగమన్నారు. అనంతరం షోల్డర్, నీ రిప్లేస్‌మెంట్ చేయించుకున్న ఎండోమెంట్ విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ రవీంద్రరెడ్డి, కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ విశ్రాంత క్యాషియర్ బుజ్జిరెడ్డి ఆపరేషన్ తర్వాత తమకు నొప్పులు లేవని తెలిపారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేలా..

- జిల్లాలో స్పెషల్ డ్రైవ్
- మందుబాబులపై 40 కేసులు



జొన్నవాడ ఆర్చి వద్ద తనిఖీలు చేస్తున్న రూరల్ ఇన్‌స్పెక్టర్ వేణు

నెల్లూరు(క్రైమ్) : అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి 11 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన కూడళ్లు, హైవే ప్రవేశ ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 16 మందిపై కేసులు నమోదు చేశారు. మోటార్ వెహికల్ యాక్ట్ కింద 175 కేసులు నమోదు చేసి రూ.75,125 అపరాధ రుసుం విధించారు. బహిరంగ మద్య సేవనంపై 24 కేసులు నమోదు చేసి 24 మందిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అక్రమరవాణా, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా ప్రతి శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. మితిమీరిన వేగం, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితరాల వల్లనే అధికశాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. అపసవ్య దిశలో రాకపోకలు ప్రమాదమని, రాంగ్‌రూట్‌లో వెళ్లరాదన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా నగరోత్సవం



నెల్లూరు(బృందావనం) : మైపాడురోడ్డులో వైకుంఠపురం మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా 108 మంది మహిళలు పవిత్ర జల కలశాలతో ఆదివారం నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం పాలకమండలి కమిటీ సభ్యుడు కాకాణి వెంకటేష్ మాట్లాడుతూ రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం ప్రాంగణంలో పవిత్ర పినాకిని నది నుంచి 108 కలశాలతో గోపురం వీధి, శెట్టిగుంటరోడ్డు, సత్యనారాయణపురం మీదుగా వైకుంఠపురంలోని అమ్మవారి సన్నిధి వరకు నగరోత్సవాన్ని చేపట్టామన్నారు. పాలక మండలి సభ్యులు గుణపాటి భాస్కరయ్య, ధన్వి శ్రీనివాస్, కొండయ్య, కుడుముల వెంకటేష్, లక్ష్మణ్, రంగయ్య, తాళ్లూరు శశికుమార్, చెంగలరాయుడు పర్యవేక్షించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(సెంట్రల్) : కోవూరు నియోజకవర్గ పరిధిలోని పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నెల్లూరులోని వారి నివాసంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం రూ.8.56 లక్షల వరకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు తెలియజేశారు.

మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్) : ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంబాపురం గ్రామ రెవెన్యూ అధికారి రమణయ్య ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడు గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వి తరలిస్తున్నారు. ఈ విషయాన్ని ఆ గ్రామ వీఆర్‌ఏ రాగయ్య ఈనెల మూడో తేదీన అంబాపురం వీఆర్వో రమణయ్యకు తెలియజేశారు. దీంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకుని అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. విషయాన్ని రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు రమణయ్య ఆదివారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారిస్తున్నారు.

ఘనంగా విశ్వనాథక్రౌతుల జయంతి




నెల్లూరు(బృందావనం) : నగరంలోని టీవీఎస్ కల్యాణ సదన్‌లో వేదసాహిత్య పరిషత్ నెల్లూరు ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ ఆరివిత్తూరు విశ్వనాథక్రౌతుల వారి జయంతి సభ ఆదివారం ఘనంగా జరిగింది. తొలుత గణపతి పూజ, కలశ స్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు నేలనూతల గురుదత్తశర్మ, సూరం వెంకట సుకుమార్‌శర్మలచే సాయంత్రం కృష్ణయజుర్వేద పారాయణం గావించారు. కార్యక్రమంలో అరివిత్తూరు భార్గవ గణపతిశర్మ, స్వయంపాకుల మురళీకృష్ణ, మాచవోలు రమేష్‌శర్మ పాల్గొన్నారు.

పాటూరు శ్రీనివాసులుకు సన్మానం



నెల్లూరు(బృందావనం) : నగరంలోని పుర మందిరంలో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్, కేతా సుబ్బారావు ప్రజావేదిక సంయుక్త ఆధ్వర్యంలో 'అమ్మనాన్నలను పూజించండి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు కేతా సుబ్బారావు మాట్లాడుతూ భారతదేశంలో తల్లిదండ్రులకు ఎంతో విశిష్ట స్థానం ఉందన్నారు. అనంతరం గాయకుడు పాటూరు శ్రీనివాసులును సన్మానించారు. తల్లిదండ్రుల ప్రాధాన్యతను వివరిస్తూ పాటల పోటీలు నిర్వహించారు. అలాగే శాస్త్రీయ, నృత్య పోటీలను జరిపించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాగినేని ప్రభాకర్, ఆనంద్, నజీర్‌బాషా గురూజీ, కనకరాజు, షఫీ, అమానుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంపై ఆసక్తి పెంచుకోవాలి



'అంతరంగ వీక్షణం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

నెల్లూరు(బృందావనం) : తల్లిదండ్రులు, గురువులు బాల్యం నుంచి తమ పిల్లలకు మాతృభాషతో పాటు సాహిత్యంపై ఆసక్తి పెంపొందించాలని వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ ఎస్.విజయభాస్కరరావు తెలిపారు. పుర మందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్లో చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విల్సన్‌రావు కొమ్మవరపు రచించిన ముఖాముఖి సంకలనం 'అంతరంగ వీక్షణం' ఆవిష్కరణ, పరిచయ సభ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ సమాజాన్ని సాహిత్యం ఎంతో ప్రభావితం చేస్తుందన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రతి విద్యార్థి తెలుగులో రాయడం, చదవడం తప్పనిసరి కావాలన్నారు. విల్సన్‌రావు కొమ్మవరపు ముఖాముఖి సంకలనం ఎంతో హృద్యంగా ఉందన్నారు. కవి, విమర్శకుడు జి.లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ సమాజ సంక్షేమానికి సాహితీవేత్తలు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. అనంతరం కవులకు ప్రోత్సాహకంగా నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు గోవిందరాజు సుభద్రాదేవి, ఈతకోట సుబ్బారావు, ఎఱ్ఱాశాస్త్రి, పెళ్లూరు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, ఆహార ప్యాకెట్ల పంపిణీ



నెల్లూరు(సెంట్రల్) : పర్వతరెడ్డి బలరామిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బారాషహీద్ దర్గా ప్రాంతంలో నిరుపేదలకు ఆదివారం దుప్పట్లు, ఆహార ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు ట్రస్టీ శ్రవంతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవసేనారెడ్డి వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రమణారెడ్డి, సురేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజలు



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత స్వామివారి సన్నిధిలో పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు, రాత్రి భిక్ష స్వీకరించారు. ఉభయకర్తలుగా దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి– మంజుల, దువ్వూరు యశ్వంత్‌రెడ్డి– మన్యరెడ్డి, డి.కృష్ణప్రసాద్‌రెడ్డి– షర్మిలారెడ్డి, డి.విజయభాస్కర్‌రెడ్డి– సుదర్శనమ్మ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, కోశాధికారి జి.రత్నయ్య పాల్గొని పర్యవేక్షించారు.

'ఆయుష్మాన్ భారత్'కు నమోదు



నెల్లూరురూరల్ : రామలింగాపురంలోని చాకలివీధిలో 70 ఏళ్లు దాటిన వృద్ధులను ఆయుష్మాన్ భారత్ పథకం కింద నమోదు ప్రక్రియ ఆదివారం జరిగింది. బీజేపీ నేతల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి నమోదు ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు చిలకా ప్రవీణ్‌కుమార్, మునునూరు సుబ్బారావు ఉన్నారు.